
సాక్షి
కృష్ణాజిల్లా
మంగళవారం । 9 । జూలై । 2024



బీసీ సంక్షేమ హాస్టల్‌లో తనిఖీలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): జ్యోతిరావ్ పూలే బీసీ సంక్షేమ శాఖ బాలుర హాస్టల్‌ను బీసీ సంక్షేమ శాఖ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 503.50 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

తెలంగాణ సీఎంను కలిసిన కలెక్టర్



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలకు విజయవాడ విచ్చేసిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన మర్యాదపూర్వకంగా కలిశారు.

న్యూస్‌రీల్

రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలి



ఉంగుటూరు: రోగులపై ప్రత్యేక శ్రద్ధ వహించి సకాలంలో వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులకు కలెక్టర్ డి.కె.బాలాజీ సూచించారు. ఉంగుటూరు మండలంలోని పెద్దఅవుటపల్లి పీహెచ్‌సీని కలెక్టర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని మందులు, ఓపీ రిజిస్టర్, ప్రయోగశాలను పరిశీలించారు. ఈ కేంద్రంలో చేస్తున్న 63 రకాల పరీక్షలు, పాము, కుక్కకాటుకు అవసరమైన మందుల లభ్యతపై ఆరా తీశారు. క్షయ వ్యాధి బాధితులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి మందులు సక్రమంగా ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. సురక్షిత ప్రసవ కేలండర్ ప్రకారం ప్రతి నెలా గర్భిణులకు సరైన మందులు, సూచనలు ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. హై రిస్కు కేసులు, మలేరియా కేసులు, కుష్ఠు వ్యాధి కేసుల వివరాలు తెలుసుకున్నారు. నెలకు ఒకటి, రెండు ప్రసవాలు జరుగుతున్నాయని కలెక్టర్‌కు డాక్టర్లు సుజిత, మనోహర్‌రెడ్డి తెలిపారు.

15 నుంచి ఫొటోగ్రఫీ, టైలరింగ్‌లో శిక్షణ

ఉంగుటూరు: మండలంలోని ఆత్కూరు గ్రామంలో ఉన్న స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలో యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో ఫొటోగ్రఫీ అండ్ వీడియో, టైలరింగ్, సెల్‌ఫోన్ రిపేరు, సర్వీసు కోర్సుల్లో శిక్షణ ఈ నెల 15 నుంచి ప్రారంభమవుతుందని సంస్థ డైరెక్టర్ పి.మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన సోమవారం మాట్లాడారు. 18 నుంచి 45 ఏళ్ల లోపు యువతీయవకులు ఈ కోర్సుల్లో ఉచిత శిక్షణకు అర్హులన్నారు. 30 రోజుల శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతి కల్పిస్తామని తెలిపారు. ఆసక్తిగల వారు నాలుగు పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలు, రేషన్, ఆధార్‌కార్డు, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను శిక్షణ కేంద్రంలో అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 63042 54730, 99519 20120 సెల్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఉచిత ఇసుక విధానం అమలుకు చర్యలు

జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ



చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో ఉచిత ఇసుక విధానం అమలుకు చర్యలు తీసుకోవాలని అధికారులను జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సోమవారం సాయంత్రం గనులు, రవాణా, ఇరిగేషన్, ఎస్ఈబీ, ఇతర అధికారులతో ఉచిత ఇసుక విధానం అమలుకు తీసుకోవాల్సిన చర్యలపై జేసీ చర్చించారు. ఈ సందర్భంగా జేసీ గీతాంజలిశర్మ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానాన్ని మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అనధికారికంగా ఇసుక తవ్వకాలు, అక్రమ రవాణాను అరికట్టేందుకు అవసరమైన ప్రాంతాల్లో చెక్‌పోస్టు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇసుక రీచ్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిన ప్రదేశాలను గుర్తించాలన్నారు. జిల్లా, రెవెన్యూ డివిజన్ల స్థాయిల్లో కమాండ్ కంట్రోల్ రూమ్‌లతో పాటు డివిజన్, మండలస్థాయిలో విజిలెన్స్ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ జి.వెంకటేశ్వరరావు, ఆర్డీఓలు ఎం.వాణి, పి.పద్మావతి, దాసి రాజు, గనుల శాఖ ఏడీ ప్రతాపరెడ్డి, డీపీఓ నాగేశ్వరనాయక్, ఎస్ఈబీ సూపరింటెండెంట్ జి.గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

బంగారు తాపడం పనులకు విరాళాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ ఆలయ బంగారు తాపడం పనులకు సోమవారం భక్తులు రూ. 2 లక్షల విరాళాలను అందజేశారు. హైదరాబాద్ గుడిమల్కాపూర్‌కు చెందిన ఉల్లగంటి వనజ, సుబ్బారావు రూ.1,00,001, అమెరికా కాలిఫోర్నియాకు చెందిన రాచర్ల శరత్ పేరిట రూ.1,00,001 విరాళాన్ని దాతలు ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ ఏఈఓ ఎస్.రమేష్‌బాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు.



పామర్రులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



బందరు నాగపోతరావుసెంటరులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పేర్ని కిట్టు, నాయకులు



పెడనలో వైఎస్సార్ భారీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఉప్పాల రాము

మరపురాని మహానేత

- జిల్లాలో ఘనంగా డాక్టర్ వైఎస్సార్ జయంతి వేడుకలు
- రాజన్న విగ్రహాలు, చిత్రపటాల వద్ద నివాళులర్పించిన నాయకులు
- కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు
- వైఎస్ సంక్షేమ పథకాలు, చేసిన మేలులను స్మరించుకున్న ప్రజలు



అవనిగడ్డ వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

సాక్షి, మచిలీపట్నం: మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి వేడుకలను జిల్లా ప్రజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జోహార్ వైఎస్సార్.. వైఎస్సార్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్‌లు కట్ చేశారు. పేదలు, రైతుల పక్షపాతిగా ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, ప్రజల గుండెల్లో కొలువైన మహా నాయకుడు వైఎస్సార్ అని కొనియాడారు. ఆయన తీసుకొచ్చిన ఉచిత విద్యుత్, ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, 108, 104, జలయజ్ఞం వంటి పథకాలతో పాటు జిల్లా అభివృద్ధి కోసం చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. కృష్ణా యూనివర్సిటీ, బందరు పోర్టు, కృష్ణా డెల్టాకు నీరు, మత్స్య పాలిటెక్నిక్ కళాశాల, కలంకారీ పరిశ్రమకు జీవంపోయడం వంటి పథకాలు మరిచిపోలేనివన్నారు. ఆయన సేవలు, పథకాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాయని కొనియాడారు. పలు చోట్ల నాయకులు, కార్యకర్తలతో కలిసి సేవా కార్యక్రమాలను నిర్వహించారు.

- మచిలీపట్నం నియోజకవర్గంలో వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. బందరు జిల్లా కోర్టు సెంటర్, నాగపోతరావు సెంటరులో వైఎస్సార్ విగ్రహాలకు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యకర్తలతో కలిసి కేక్‌లు కట్ చేశారు. మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సిలార్ దాదా, మార్కెట్ మాజీ చైర్మన్ షేక్ అచ్చేబా, కార్పొరేటర్లు మేకల సుబ్బన్న, రాసంశెట్టి వాణీశ్రీ, షేక్ ముంతాజ్, మాచవరపు రాంప్రసాద్, తిరుమలశెట్టి వరప్రసాద్, ఐనం తాతారావు పాల్గొన్నారు. గిలకలదిండి మునిసిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు పేర్ని కిట్టు నోట్ పుస్తకాలను అందజేశారు.
- పామర్రులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంతో పాటు ప్రధాన సెంటరులో ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. తోట్లవల్లూరు, పమిడిముక్కల, పెదపారుపూడి, మొవ్వ మండలాల్లోని రాజన్న విగ్రహాల వద్ద జయంతి వేడుకలు నిర్వహించారు. పలువురు ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.
- పెడన నియోజకవర్గంలో పార్టీ ఇన్‌చార్జి ఉప్పాల రాము ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించారు. పెడనలోని పార్టీ కార్యాలయంలో పాటు పట్టణంలోని వైఎస్సార్ విగ్రహానికి రాము పూల మాలలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు. బంటుమిల్లి, గూడూరు, కృత్తివెన్ను మండలాల్లో ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు పార్టీ కార్యకర్తలతో కలిసి సంబరాలు చేసుకున్నారు.
- అవనిగడ్డలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయం, వంతెన సెంటర్లలో వైఎస్సార్ విగ్రహాలకు మాజీ శాసన సభ్యుడు సింహాద్రి రమేష్‌బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. మోపిదేవి, చల్లపల్లి మండలాల్లోని వైఎస్సార్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
- గుడివాడ నియోజకవర్గంలోని గుడివాడ, నందివాడ, గుల్లవల్లేరు మండలాల్లో వైఎస్సార్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.
- పెనమలూరు నియోజకవర్గంలోని కంకిపాడు, పెనమలూరు, ఉయ్యూరు మండలాలు, పలు గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలకు వైఎస్సార్ సీపీ నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంపీపీ, జెడ్పీటీసీలతో పాటు నాయకులు, కార్యర్తలు పాల్గొన్నారు.
- గన్నవరం నియోజకవర్గ పరిధిలోని గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు, విజయవాడ రూరల్ మండలాల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సారె సంబరం



సారె సమర్పించిన భక్త బృందాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఆషాఢ మాసోత్సవాలను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు సోమవారం పలు భక్త బృందాలు సారెను సమర్పించాయి. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు భక్తులు బృందాలుగా అమ్మవారి సన్నిధికి చేరుకుని సారెను సమర్పించాయి. శ్రీకనకదుర్గ లలితా పారాయణ బృందానికి చెందిన నాలుగు వందల మందితో పాటు విజయవాడ, గుంటూరు పరిసరాల నుంచి విచ్చేసిన 723 మంది భక్తులు అమ్మవారికి సారెను సమర్పించారు. వీరికి ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. ప్రత్యేక క్యూలైన్ మార్గంలో ప్రధాన ఆలయంలోని మూలవిరాట్‌ను దర్శించుకున్న అనంతరం మహామండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తికి సారెను సమర్పించి పూజలు జరిపించుకున్నారు. ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి ప్రసాదాలను పంపిణీ చేశారు.

డయేరియా నియంత్రణకు పటిష్ట చర్యలు

కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ


చిలకలపూడి(మచిలీపట్నం): 'స్టాప్ డయేరియా' క్యాంపెయిన్‌ను పటిష్టంగా నిర్వహించి వ్యాధి నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మునిసిపల్, వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్ అధికారులతో ఆయన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకులను తరచూ తనిఖీ చేసి శుభ్రపరిచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటిని కచ్చితంగా క్లోరినేషన్ చేయాలని స్పష్టంచేశారు. తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకు క్లీనింగ్ చేసినట్లు చుట్టుపక్కల వారితో సంతకం తీసుకోవటంతో పాటు వారి ఫోన్ నంబరు నమోదు చేసుకోవాలని ఆదేశించారు. తాను స్వయంగా గ్రామాలు, పట్టణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి రిజిస్టర్లను పరిశీలిస్తానని హెచ్చరించారు. తాగునీటిని సరైన విధంగా క్లోరినేషన్ చేయాలని, నీటి శాంపిల్స్ పరీక్షలు జరపాలని సూచించారు. ప్రైవేటు ఆర్వో ప్లాంట్లను కూడా తనిఖీ చేసి నీటి పరీక్షలు నిర్వహించి ధ్రువ పత్రాలు సమర్పించాలన్నారు. ఎక్కడైనా పైప్‌లైన్ లీకేజీలను గుర్తిస్తే ఆయా పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓ, మునిసిపల్ అధికారులకు తెలియజేయాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ జి.గీతాబాయి, డీపీఓ నాగేశ్వరనాయక్, గ్రామీణ నీటి సరఫరా అధికారి టి.శివ ప్రసాద్, మునిసిపల్ కమిషనర్లు బాపిరాజు, బాలసుబ్రహ్మణ్యం, పి.వెంకటేశ్వరరావు, ఎం.వెంకటేశ్వర్లు, బి.వెంకట్రామయ్య, ఐసీడీఎస్ పీడీ ఎస్.సువర్ణ పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్‌లో తెలంగాణ సీఎంకు స్వాగతం

విమానాశ్రయం(గన్నవరం): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సోమవారం గన్నవరం విమానాశ్రయంలో కృష్ణా జిల్లా అధికారులు స్వాగతం పలికారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో జరిగిన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు ప్రత్యేక విమానంలో ఆయన ఆదివారం సాయంత్రం ఇక్కడికి చేరుకున్నారు. రేవంత్‌రెడ్డితో పాటు తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీప్‌దాస్ మున్షీ, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు ఉన్నారు. వారికి కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ, ఎస్పీ అద్నాన్ నయీం ఆస్మి, పలువురు అధికారులు స్వాగతం పలికారు. అనంతరం తెలంగాణ సీఎం, డెప్యూటీ సీఎం, మంత్రులు రోడ్డు మార్గాన మంగళగిరికి బయలుదేరి వెళ్లారు.

పసిడి సాగుకు శ్రీకారం

- పసుపు విత్తనం నాటే పనుల్లో రైతులు నిమగ్నం
- రైతులకు భారంగా మారిన విత్తనం ధర
- సాగు విస్తీర్ణం తగ్గుతుందని ఉద్యాన శాఖ అంచనా



నాటేందుకు సిద్ధంగా ఉన్న పసుపు విత్తనం



విత్తనం నాటుతున్న కూలీలు

కంకిపాడు: ప్రధాన వాణిజ్య పంటల్లో ఒకటైన పసుపు (పచ్చబంగారం) సాగుకు రైతులు శ్రీకారం చుట్టారు. అడపాదడపా కురిసిన వర్షాలకు పొలాలు పదునుకు రావటంతో సాళ్లు వేసి పసుపు విత్తనం నాటుతున్నారు. సాగుకు అవసరమైన విత్తనాన్ని ఇప్పటికే సేకరించారు. ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా పచ్చబంగారం సాగు పనులను రైతులు ముమ్మరం చేశారు. ఉమ్మడి కృష్ణాజిల్లా వ్యాప్తంగా పసుపును ప్రధాన వాణిజ్య పంటగా రైతులు సాగు చేస్తున్నారు. సాధారణంగా కృష్ణాజిల్లా వ్యాప్తంగా 2,773 హెక్టార్లు, ఎన్టీఆర్ జిల్లాలో 523 హెక్టార్లలో పసుపు సాగవుతుంది. విత్తనం నాటేందుకు పొలాలు అదునుకు వచ్చాయి. దీంతో రైతులు దుక్కులు దున్ని, నాగళ్లతో సాళ్లు వేసుకుని విత్తనం నాటుతున్నారు. కడప, మైదుకూరు, శేలం, ప్రగతి, స్థానిక విత్తన రకాలను రైతులు సాగుకు ఎంచుకుంటున్నారు.

అమ్మో విత్తు.. భారం

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది పసుపు విత్తనం రైతులకు మోయలేని భారంగా మారింది. పుట్టు (225 కిలోలు) విత్తనం పసుపు కొమ్ముల ధర మార్కెట్‌లో రూ.10,500 నుంచి రూ.11,500 వరకు పలుకుతోంది. ఎకరాకు ఆరు పుట్ల వరకూ విత్తనం అవసరం. గతంలో పుట్టు విత్తనం ధర రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు మాత్రమే ఉండేది. ఈ ఏడాది ఏకంగా రూ.10,500లకు పైగా చేరటంతో రైతులపై భారం పడింది. ఒక్కో ఎకరాకు విత్తనం రూపంలోనే రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకూ భారం పడినట్లయింది. ఎకరాకు రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకూ కౌలు ఒప్పందాలు చేసుకుని, సాగుకు అవసరమైన విత్తనాన్ని సమకూర్చుకుని కౌలు రైతులు సాగు పనులు చేపడుతున్నారు.

అమ్మబోతే అడవి... కొనబోతే కొరివి

ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో పసుపు పంట చేతికి వచ్చింది. పచ్చి పసుపు పుట్టు రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకూ పలికింది. ఎండు పసుపు కొమ్ముల ధర క్వింటా రూ.14 వేల నుంచి రూ.15 వేల వరకూ వెళ్లింది. ప్రస్తుతం ఎండు పసుపు ధరలు నిలకడగానే ఉన్నాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలించటం, దిగుబడులు బాగుండటంతో పాటుగా మార్కెట్‌లో ధర ఆశాజనకంగా ఉండటంతో రైతులు తేరుకున్నారు. మంచి ధర లభించటంతో ఈ ఏడాది ఒడిశా, ఇతర రాష్ట్రాల నుంచి రైతులు పసుపు విత్తనం కొనుగోళ్లకు ఎగబడటంతో విత్తనం పసుపు కొమ్ము ధరలు అమాంతంగా పెరిగాయి.

సాగు తగ్గుతుందనే అంచనా

ఉమ్మడి జిల్లాలో 3,296 హెక్టార్లలో ఏటా పసుపు సాగు జరుగుతుంది. దిగుబడి, మార్కెట్ ధరలు ఆశాజనకంగా ఉండటంతో ఈ ఏడాది కూడా సాగు సాధారణ విస్తీర్ణంలోనే జరుగుతుందని తొలుత ఉద్యాన శాఖ భావించింది. అయితే పసుపు విత్తనం కొమ్ము ధర పెరగటంతో రైతులు ఇతర పంటల సాగుకు ఆసక్తి చూపుతారని, ఫలితంగా పసుపు సాగు విస్తీర్ణం తగ్గుతుందని ఉద్యాన శాఖ అధికారులు అంచనావేశారు. గతేడాదితో పోలిస్తే ఈ దఫా సుమారు 300 ఎకరాలకు పైగా తగ్గొచ్చని సమాచారం.

పెట్టుబడులు పెరిగాయి



ఈ దఫా పెట్టుబడులు బాగా పెరుగుతున్నాయి. విత్తనానికి డిమాండ్ పెరగటంతో మార్కెట్‌లో పుట్టు విత్తనం ధర రూ.10,500లకు పైగా పలుకుతోంది. ఎకరాకు ఆరు పుట్లు అవసరం. విత్తనం ధర పెరగడంతో ఎకరాకు రూ.30 వేలకుపైగా అదనపు వ్యయం అయినట్టే. మార్చిలో మేము పచ్చిపసుపు అమ్మితే రూ.3 వేలు మాత్రమే పలికింది. ఈ దఫా విత్తనం ధర, కూలి రేట్లు కూడా పెరగటంతో పెట్టుబడులు పెరుగుతున్నాయి. దిగుబడులు, ధరపై ఆశతో సాగుకు ఉపక్రమిస్తున్నాం.

– దేవిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, రైతు, చలివేంద్రపాలెం, కంకిపాడు మండలం

ప్రజాసమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం

- కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ
- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 152 అర్జీల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బాలాజీ, ఇతర అధికారులు

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీ–కోసం) కార్యక్రమం సోమవారం జరిగింది. కలెక్టర్‌తో పాటు జేసీ గీతాంజలిశర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు, ఆర్డీఓ ఎం.వాణి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ.. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు సమస్యల పరిష్కారం కోసం కొండంత ఆశతో కలెక్టరేట్‌కు వస్తున్నారని పేర్కొన్నారు. అధికారులు ప్రత్యేక శ్రద్ధతో వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. సమస్యను పూర్తి స్థాయిలో అవగాహన చేసుకునేందుకు అవసరమైతే క్షేత్రస్థాయికి వెళ్లాలన్నారు. ఈ పరిష్కార వేదికలో అధికారులు 152 అర్జీలను స్వీకరించారు.

ముఖ్యమైన అర్జీలు ఇవీ..

- బంటుమిల్లి మండలం ఆముదాలపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని తన పొలంలో వరి సాగుచేశానని, ఓఎన్‌జీసీ ద్వారా విడుదలయ్యే రసాయన వ్యర్థాల కారణంగా తన పంటకు నష్టం జరిగిందని ఆ గ్రామానికి చెందిన రైతు జన్ను వీరఅర్జునరావు ఫిర్యాదు చేశారు. ఎకరానికి రూ.50 వేల చొప్పున ఖర్చు చేశానని పంట కోయకుండానే కుళ్లిపోయిందని, నష్టపరిహారం ఇప్పించాలని విజ్ఞప్తిచేశారు.
- తన తండ్రి సుబ్బారావు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తూ గత సంవత్సరం జనవరి నెలలో అనారోగ్యంతో మృతిచెందారని, బీటెక్ చదువుకున్న తనకు కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ కలెక్టర్‌కు కంకిపాడుకు చెందిన కోలవెన్ను గుణశేఖర్ అర్జీ ఇచ్చారు.

క్లుప్తంగా

వడ్డీతో వైద్య ఖర్చులు చెల్లించండి

చిలకలపూడి(మచిలీపట్నం): ఖాతాదారునికి వడ్డీతో సహా వైద్య ఖర్చులు చెల్లించాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు చింతలపూడి కిషోర్‌కుమార్, సభ్యులు నందిపాటి పద్మారెడ్డి, శ్రీలక్ష్మీ రాయల సోమవారం తీర్పు చెప్పారు. మచిలీపట్నంకు చెందిన యక్కల సుబ్బారావు భార్య పద్మావతి పేరుతో యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీలో 2021 జూన్ 9వ తేదీన మెడిక్లయిమ్ పాలసీని తీసుకున్నారు. ఈ పాలసీ 2022 జూన్ 8వ తేదీ వరకు అమలులో ఉంది. సుబ్బారావు 2022 మార్చి 18వ తేదీన కంటి ఆపరేషన్ చేయించుకుని రూ.23,299 ఆసుపత్రిలో చెల్లించారు. దీని నిమిత్తం ఇన్సూరెన్స్ కంపెనీకి క్లయిమ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మొత్తం చెల్లించకుండా కాలయాపన చేయటంతో సుబ్బారావు కంపెనీకి నోటీసు పంపించారు. అయినప్పటికీ వారు చెల్లించకపోవటంతో వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. పూర్వాపరాలు విచారించిన అనంతరం కమిషన్ సభ్యులు నోటీసు పంపిన నాటి నుంచి 9 శాతం వడ్డీతో కలిపి చెల్లించాలని, మానసిక వేదనకు గురి చేసినందుకు గాను రూ.10 వేలు, ఖర్చుల నిమిత్తం మరో రూ.5 వేలు 30 రోజుల్లోగా చెల్లించాలని తీర్పు చెప్పారు.

రఘునందన్‌కు రావూరి భరద్వాజ స్మారక పురస్కారం



తిరువూరు: ఎన్టీఆర్ జిల్లా అభ్యుదయ రచయితల సంఘ కార్యదర్శి రేపాక రఘునందన్‌కు ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం రావూరి భరద్వాజ స్మారక పురస్కారాన్ని అందజేసింది. ఆదివారం రాత్రి విజయవాడలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ శ్రీరాము సత్యనారాయణ, రావూరి భరద్వాజ తనయుడు వెంకట కోటేశ్వరరావు చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని రఘునందన్ అందుకున్నారు. గత 42 ఏళ్లుగా అనేక కవితలు, కథలు, వ్యాసాలు రాయడంతో పాటు విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో యువవాణి, కవితాగోష్ఠులు, ఉపన్యాసాల ద్వారా సాహితీ సేవ చేస్తున్న రఘునందన్, ఇటీవల ప్రతిజ్ఞ రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు జీవిత చరిత్రను తెలుగు, హిందీభాషల్లోకి అనువదించారు. పైడిమర్రి ముఖచిత్రంతో పోస్టల్ కవరును కూడా విడుదల చేయించారు. రేపాక సాహితీసేవను విశ్వబ్రాహ్మణ సంఘ వ్యవస్థాపక అధ్యక్ష కార్యదర్శులు కోసూరి రాజశేఖర్, భవిరి రవి, గౌరవాధ్యక్షుడు శంకరనాథ్ తదితరులు అభినందించారు.

ఫుడ్ కోర్టుపై రాజకీయ కక్ష

- టీడీపీ నాయకుల ఒత్తిడితో దుశ్చర్య
- దుకాణాలు తొలగించిన మునిసిపల్ అధికారులు
- ప్రత్యామ్నాయం చూపాలంటున్న చిరు వ్యాపారులు
- ప్రజలకు ఇబ్బంది, కోర్టు ఆదేశాలు బూచిగా చూపి తొలగింపు



ఫుడ్‌కోర్టు దుకాణాలు తొలగించి మెరకను జేసీబీతో ధ్వంసం చేస్తున్న దృశ్యం

మచిలీపట్నంటౌన్: తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి కల్పిస్తామని చెప్పిన టీడీపీ పెద్దలు అధికారం వచ్చిన అనంతరం ఉన్న ఉపాధిని పోగొడుతున్నారు. నగర ప్రజలకు రాత్రి పూట తినుబండారాలు అందించటంతో పాటు ఉపాధి చూపే సదుద్దేశంతో గత ప్రభుత్వం ఫుడ్ కోర్టును ఏర్పాటు చేసింది. దాదాపు 55 స్టాల్స్‌తో వందల మందికి ఉపాధి కల్పిస్తూ ఫుడ్‌కోర్టును ఏర్పాటు చేశారు. ఎలాంటి రద్దీ లేని, చీకటిగా ఉండి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్న మార్కెట్‌యార్డు రోడ్డులో ఫుడ్‌కోర్టును ఏర్పాటు చేశారు. రాత్రి ఒంటి గంట వరకు విద్యుత్ దీపాల వెలుగులతో ప్రజల రాకపోకలతో కోలాహలంగా ఫుడ్ కోర్టు నడుస్తోంది. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైఎస్సార్ సీపీకి చెందిన వ్యక్తులతో ఫుడ్ కోర్టు నిర్వహణ జరుగుతోందని భావించి దీనిని తొలగించేందుకు పావులు కదిపారు. ఆ మేరకు మునిసిపల్ అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారు. ఈ విషయం తెలిసి ఫుడ్ కోర్టు చిరు వ్యాపారులు ప్రజాప్రతినిధులను కలిసి తమ ఉపాధిని దెబ్బతీయవద్దని ప్రాధేయపడిన పాలకులు కనికరం చూపలేదు. ప్రజలకు అసౌకర్యంగా ఉందని, శుభ్రత కరవవుతోందని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని తమ అనుయాయులతో కోర్టులో కేసులు వేయించి దుకాణాలు తొలగింపజేశారు. తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, కోర్టు ఆర్డర్లను తమకు చూపకుండానే తమ దుకాణాలను తొలగించారని వ్యాపారులు వాపోతున్నారు. మునిసిపాల్టీకి స్టాల్‌కు రూ.1500 అద్దె చెల్లిస్తున్నామని, విద్యుత్ మీటరు కోసం రూ. 2,500 డిపాజిట్‌గా చెల్లించామని, ఆ డిపాజిట్ ఇవ్వకుండానే కనెక్షన్లు తొలగించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమపై కక్షసాధింపు చర్యలకు దిగటం సబబు కాదన్నారు.



ఫుడ్ కోర్టు (ఫైల్)

ముందస్తు సమాచారం లేకుండా తొలగింపు

ఫుడ్ కోర్టులో చిరువ్యాపారులు ఏర్పాటు చేసుకున్న దుకాణాలను మునిసిపల్ అధికారులు పోలీసుల సహకారంతో జేసీబీతో తొలగించారు. కొంతమంది దుకాణదారులు వారి బడ్డీలను స్వచ్ఛందంగా తొలగించుకోగా, దుకాణదారులు లేని బడ్డీలను జేసీబీతో మునిసిపల్ ట్రాక్టర్‌లోకి వేసి తొలగించారు. పల్లపు ప్రాంతంగా ఉండటంతో చేసిన మెరకను సైతం జేసీబీతో తొలగించారు.

ఫిర్యాదుల వల్లే ఫుడ్ కోర్టు తొలగించాం

కోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు కావటం వల్లే ఫుడ్ కోర్టు తొలగించామని మునిసిపల్ కమిషనర్ బాపిరాజు తెలిపారు. ప్రజలకు అసౌకర్యంగా, ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తుందనే ఫిర్యాదుతో ఫుడ్‌కోర్టును తొలగించామన్నారు. చిరు వ్యాపారుల ఉపాధిని దెబ్బతీయాలనే ఉద్దేశం తమకు లేదన్నారు.

–బాపిరాజు, మున్సిపల్ కమిషనర్

ప్రజల కోసమే పోలీసు సేవలు

కోనేరుసెంటర్: ప్రజల కోసమే పోలీసు సేవలు అని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసమే పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు ఎటువంటి సమస్య ఉన్నా ఈ కార్యక్రమాన్ని ఆశ్రయించవచ్చునన్నారు. ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి విచారణ అనంతరం చట్టపరిధిలో బాధితులకు న్యాయం జరిగేలా చూస్తారన్నారు. జిల్లా కార్యాలయంతో పాటు జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్‌లోనూ బాధితులు తమ సమస్యలను సంబంధిత స్టేషన్ అధికారికి విన్నవించవచ్చునన్నారు. అక్కడ సమస్యకు పరిష్కారం దొరకని పక్షంలో జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగే పబ్లిక్ గ్రీవెన్స్‌ను ఆశ్రయించి న్యాయం పొందవచ్చునని తెలిపారు. న్యాయం కోరుతూ పోలీసులను ఆశ్రయించే బాధితులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవటంతో పాటు స్నేహపూరిత వాతావరణంలో వారి సమస్యలను ఆలకించాలని సిబ్బందికి సూచించారు. బాధితులకు న్యాయం చేయటంలో అలసత్వం వహించినా, నిర్లక్ష్యం ప్రదర్శించినా క్షమించేదిలేదన్నారు.



బాధితుల సమస్యలను ఆలకిస్తున్న ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు భిక్షమయ్య

కంచికచర్ల: సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విదానాన్ని అమలు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేముల భిక్షమయ్య డిమాండ్ చేశారు. మండలంలోని గొట్టుముక్కల, పరిటాల, కొత్తపేట, గనిఆత్కూరు, చెవిటికల్లు, బత్తినపాడు, తదితర గ్రామాల పాఠశాలలకు వెళ్లి సోమవారం ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐఆర్, 12వ పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని, ప్రభుత్వ విద్యారంగాన్ని నాశనం చేస్తున్న జీఓ నంబర్ 117ను వెంటనే రద్దు చేయాలని కోరారు. తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే వర్తింప చేయాలన్నారు. ఇంగ్లిష్ మీడియంతో పాటు సమాంతరంగా మాతృభాషలో విద్యాబోధన జరిగే విధంగా ప్రభుత్వం ప్రకటించాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని భిక్షమయ్య తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు నంద్రు సురేష్‌బాబు, బళ్లా రవికుమార్, శేషం గోపాలరావు, కొండూరు నాగేశ్వరరావు, వాసుబాబు, రాధాకృష్ణ, మందా సుధాకర్, మాదుగుల బుచ్చిబాబు, చిలకా విక్టర్, బాణావత్ శ్రీనివాస్, జయపాల్ పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

హనుమాన్‌జంక్షన్ రూరల్: అప్పుల బాధ భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. హనుమాన్‌జంక్షన్ ఎస్‌ఐ ఏడీఎల్ జనార్దన్ తెలిపిన వివరాల ప్రకారం, స్థానిక ఇందిరానగర్‌కు చెందిన గోనె సంచుల వ్యాపారి కిమిడి ప్రసాద్ (46) తన సమీప బంధువుల వద్ద రూ.5 లక్షల అప్పు తీసుకున్నాడు. గత కొద్దిరోజులుగా బాకీ చెల్లించమని ఒత్తిడి చేయటంతో మనస్తాపం చెందిన ప్రసాద్ ఈ నెల 5వ తేదీన ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. దీన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మరణించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు చెప్పారు.

సీఎస్‌ఆర్ పనుల నివేదిక తయారు చేయండి

కృష్ణా కలెక్టర్ బాలాజీ



మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ, చిత్రంలో జేసీ గీతాంజలిశర్మ, కనెక్ట్ ఆంధ్రా సీఈవో శివశంకర్

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్) నిధుల సద్వినియోగం కోసం అవసరమైన పనుల జాబితాను సిద్ధం చేసి వారం రోజుల్లోగా అందజేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో సీఎస్‌ఆర్ నిధుల వినియోగం, కోర్టు కేసుల పరిష్కారం తదితర అంశాలపై సోమవారం అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు జీవనోపాధి కల్పించి వారి జీవన ప్రమాణాలు పెంపొందించడానికి ప్రభుత్వ శాఖల్లో ముఖ్యంగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వైద్య ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన, పర్యావరణ పరిరక్షణలో భాగంగా చేపట్టాల్సిన అంశాల్లో ఖర్చు చేయడానికి ఒక ప్రణాళిక రూపొందించాలన్నారు. కోర్టు కేసుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కోర్టుకు తాను వ్యక్తిగతంగా హాజరయ్యే పరిస్థితి తీసుకువచ్చే అధికారుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు శ్రద్ధ వహించాలన్నారు. కనెక్ట్ ఆంధ్రా సీఈవో కె.శివశంకరరావు మాట్లాడుతూ సీఎస్‌ఆర్ నిధుల వినియోగంపై అధికారులకు అవగాహన కల్పించారు. కార్పొరేట్ సామాజిక నిధులకు సంబంధించి కార్పొరేట్ సంస్థలు వారికి వచ్చే ఆదాయంలో రెండు శాతం నిధులను సామాజిక అభివృద్ధి పనులు, సుస్థిర అభివృద్ధి కోసం కేటాయించాల్సి ఉంటుందన్నారు. 16 అంశాల్లో సీఎస్‌ఆర్ నిధులను వినియోగించుకోవచ్చునన్నారు. ఆరోగ్యం, విద్య, పర్యావరణ పరిరక్షణ, జీవనోపాధి, సామాజిక అవసరాలు వంటి కార్యక్రమాలకు ఈ నిధులు వినియోగించుకోవచ్చునన్నారు. చిన్న చిన్న అంతరాలతో ఏదైనా పథకాలు నిలిచిపోయి ఉంటే అటువంటి పథకాలను ఈ నిధులతో పూర్తి చేయవచ్చునన్నారు. ఆర్వో ప్లాంట్ నిర్వహణ, ఉద్యాన పంటల నిల్వకు కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్వో కె.చంద్రశేఖరరావు, బందరు ఆర్డీవో ఎం.వాణి, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, జెడ్పీ సీఈవో ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఏడుగురు అరెస్ట్

కేజీన్నర గంజాయి, నాలుగు మొబైల్స్, ఒక బైక్ స్వాధీనం



గంజాయి ముఠాతో సీఐ కిషోర్‌బాబు, ఎస్‌ఐ శ్రీనివాస్

పమిడిముక్కల: మండలంలోని లంకపల్లి శివారు అప్పారావుపేట వద్ద కృష్ణా కరకట్టపై గంజాయి విక్రయిస్తున్న ఏడుగురు వ్యక్తులను సోమవారం అదుపులోకి తీసుకొన్నారు. వారి వద్ద నుంచి కేజీన్నర గంజాయి, నాలుగు మొబైల్స్, బైక్, 500 రూపాయల నగదు స్వాధీనం చేసుకొన్నట్లు సీఐ ఎం.కిషోర్‌బాబు, ఎస్‌ఐ కె.శ్రీనివాస్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ, డీఎస్పీ శ్రీకాంత్ ఆదేశాల మేరకు గంజాయి అమ్మకాలపై నిఘా ఏర్పాటు చేశామని, అప్పారావుపేట దగ్గర కరకట్ట వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు తమకు సమాచారం అందిందన్నారు. రెవెన్యూ వారితో కలిసి దాడి చేసి గంజాయి విక్రయిస్తున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఒక్కొక్కరి వద్ద కొంత మొత్తం గంజాయి పట్టుకొని సీజ్ చేశామని, వారిని విచారించగా మద్దూరు గ్రామానికి చెందిన తలారి వివేక్ అనే వ్యక్తి గంజాయి అమ్ముతాడని, అతని వద్ద కొన్నామని చెప్పారని తెలిపారు. వివేక్ మీద కూడా కేసు నమోదు చేశామని, అతను పరారీలో ఉన్నాడని చెప్పారు. గంజాయి విక్రయిస్తున్న కొక్కిలిగడ్డ కృష్ణవంశీ, షేక్ అలీ బాబా, చీకుర్తి నాని, బండ్రపల్లి అవినాష్, రాగాల మధుకిషోర్, ముళ్లపూడి వెంకటేశ్వరరావు, షేక్ సైదాలను అరెస్ట్ చేసి కోర్టుకు పంపినట్లు తెలిపారు. వీరిలో షేక్ అలీబాబా మీద రెండు గంజాయి కేసులు, చీకుర్తి నాని మీద గంజాయి, దోపిడీ కేసులు, రాగాల మధుకిషోర్ మీద దోపిడీ కేసు, షేక్ సయ్యద్ అలీ మీద గంజాయి కేసు, వివేక్ మీద గంజాయి కేసులు న్నాయని వివరించారు. గంజాయిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని, ఎంతటివారినైనా వదిలేది లేదని హెచ్చరించారు. గంజాయి విక్రేతలపై సస్పెక్ట్ షీట్లు తెరవనున్నట్లు తెలియజేశారు. సర్కిల్ పరిధిలో ఎక్కడైనా గంజాయి అమ్మకాలు జరుగుతుంటే తమకు సమాచారం అందించాలని కోరారు.

ప్రత్యేక హోదా, విభజన హామీలను సాధించాలి

- కేంద్రంపై ఒత్తిడికి అందరి సహకారం తీసుకోవాలి
- సీఎం చంద్రబాబుకు సీపీఐ కార్యదర్శి రామకృష్ణ వినతి



మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలను సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. జిల్లా కేంద్రమైన మచిలీపట్నం విచ్చేసిన ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. ఇటీవల సీఎం చంద్రబాబునాయుడు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, కేంద్ర మంత్రులను కలిశారని అయితే ఈ సందర్భంగా వారితో జరిగిన చర్చలపై పత్రికల్లో వచ్చిన వార్తలు తమకు సంతృప్తికరంగా లేవన్నారు. అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు వేయిస్తాం, బైపాస్ రోడ్లు వేయిస్తాం, ఫ్లైఓవర్లు కడతాం అంటున్నారే కాని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా గురించి ఎక్కడా మాట్లాడినట్టు లేదన్నారు. ప్రత్యేక హోదా డిమాండ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందుకు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. వీటిని సాధించేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, అందుకు అన్ని పక్షాల సహకారాన్ని తీసుకోవాలని సూచించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకువచ్చేందుకు ఎవరు ముందుకు వచ్చినా వారితో కలిసి పనిచేసేందుకు తమ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన వేల కోట్ల ఆస్తులు పదేళ్లయినా ఇంతవరకు దాఖలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కూడా సమగ్రంగా చర్చించాల్సి ఉందన్నారు. రెండు రాష్ట్రాల తెలుగు ముఖ్యమంత్రులు సుహృద్భావ వాతావరణంలో సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని అభిలషించారు.

బాలికలను అపహరించిన కేసులో జైలు శిక్ష

చిలకలపూడి(మచిలీపట్నం): మైనర్ బాలికలను అపహరించి, వేధించిన కేసులో నిందితునికి సంవత్సరం జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి గాజుల వెంకటేశ్వర్లు సోమవారం తీర్పు చెప్పారు. అవనిగడ్డ మండలం దక్షిణ చిరువోలు లంక గ్రామానికి చెందిన ఇద్దరు మైనర్ బాలికలు ప్రతిరోజు కాలేజీకి వెళ్లే సమయంలో అదే గ్రామానికి చెందిన కారుమూరి నాగేంద్రబాబు తన ఆటోలో వారిని కాలేజీ వద్ద దింపుతానని ఎక్కించుకుని రేపల్లె వైపు తీసుకుని వెళుతుండగా బాటసారులు మైనర్ బాలికల ఏడుపును విని ఆటోను వెంబడించి నిలుపుదల చేశారు. దీంతో నాగేంద్రబాబు బాలికలను దింపేసి, ఆటోతో పరారయ్యాడు. ఈ ఘటనపై 2021 అక్టోబరు 5వ తేదీన అవనిగడ్డ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముంజులూరు వెంకట మహేష్‌కుమార్ ఆరుగురు సాక్షులను ప్రవేశపెట్టడంతో వాదనలు విన్న అనంతరం న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

పోలీస్ ప్రజావాణిలో 75 ఫిర్యాదులు



ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న డీసీపీ అధిరాజ్‌సింగ్ రాణా

విజయవాడస్పోర్ట్స్: పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(ప్రజావాణి)లో 75 మంది ఫిర్యాదులు అందజేసినట్లు పోలీస్ కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ తెలిపారు. ఈస్ట్ డీసీపీ అధిరాజ్ సింగ్ రాణా, వెస్ట్ డీసీపీ హరికృష్ణ, సీసీఆర్‌బీ ఏసీపీ వెంకటేశ్వరరావు ఫిర్యాదుదారులతో మాట్లాడి వివరాలు సేకరించినట్లు తెలిపారు. నగదు లావాదేవీల వివాదాలపై 24, కుటుంబ కలహాలపై తొమ్మిది, భూ వివాదాలపై 11, మోసాలకు సంబంధించి 11, వేధింపులకు సంబంధించి నాలుగు, దొంగతనాలపై మూడు, ఇతర వివాదాలపై 13 మంది ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఫిర్యాదులను పరిశీలించిన అనంతరం వీటిని నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించాలని సంబంధిత స్టేషన్ అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు.

విద్యుత్ శాఖ ఆకస్మిక తనిఖీలు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పురపాలక సంఘం పరిధిలో విద్యుత్ శాఖ వారు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మొత్తం 42 బృందాలుగా ఏర్పడి 3,044 సర్వీసులను తనిఖీ చేశారు. దానిలో అదనపు లోడు వినియోగిస్తున్న వారిని 269 మందిని గుర్తించి రూ.8 లక్షల 7 వేలు అపరాధ రుసుం కింద నమోదు చేశారు. విద్యుత్ చౌర్యం చేస్తున్న ఒక వ్యక్తిని గుర్తించి అతనిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా జగ్గయ్యపేట ఏడీఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం సామాజిక నేరం అని, ఎక్కడైనా విద్యుత్ చౌర్యం చేస్తున్నట్లైతే 94408 12085 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు. ఈ తనిఖీలలో విజయవాడ రూరల్ డీఈఈ జి.బి.శ్రీనివాస రావు, విజిలెన్స్ ఈఈ జి.కమలకుమారి, పేట పట్టణ ఏఈ కృష్ణారెడ్డి, రూరల్ డివిజన్ ఏఈలు, ఏడీఈలు, అకౌంట్స్ ఆఫీసర్ గురవయ్య పాల్గొన్నారు. ఏపీసీపీడీసీఎల్ యాప్, డిస్కం వెబ్‌సైట్‌లో బిల్లులు చెల్లించవచ్చు ఆర్‌బీఐ మార్గదర్శకాల మేరకు ఇక నుంచి ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం, ఇతర యూపీఐ యాప్‌లలో విద్యుత్ వినియోగదారులు బిల్లులు చెల్లించేందుకు ఏపీసీపీడీసీఎల్ డిస్కమ్ పేరు కనిపించదని విజయవాడ రూరల్ డీఈఈ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక చిల్లకల్లు రోడ్‌లోని శుభమస్తు ఫంక్షన్ హాల్‌లో సోమవారం జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆయన వివరాలు తెలిపారు. ఏపీసీపీడీసీఎల్ కన్జూమర్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని, లేదా డిస్కం వెబ్‌సైట్ నుంచి కూడా బిల్లులు చెల్లించవచ్చన్నారు. వీటి ద్వారా వినియోగదారులు బిల్లులు చెల్లించేటపుడు ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం, ఇతర యూపీఐ యాప్‌లను వాడవచ్చునని తెలిపారు. డెబిట్, క్రెడిట్, నెట్ బ్యాంకింగ్, వ్యాలెట్స్, క్యాష్ కార్డు కూడా వాడవచ్చని స్పష్టం చేశారు.

ఎల్‌ఐసీ ప్రీమియంపై జీఎస్టీ రద్దునకు కృషి

పటమట(విజయవాడతూర్పు): ఎల్‌ఐసీ ప్రీమియంపై వేసిన జీఎస్టీని రద్దు చేసేందుకు తన వంతు కృషి చేస్తానని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ హామీ ఇచ్చారు. గురునానక్ నగర్ లోని ఎన్టీఆర్ భవన్ లో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సోమవారం విజయవాడ ఎంపీని కలిసి వారి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి పార్లమెంట్‌లో ఈ విషయాన్ని ప్రస్తావిస్తానన్నారు. అనంతరం యూనియన్ కార్యదర్శి జి.కిషోర్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సాధారణ బీమా సంస్థలు నాలుగింటిని కలిపి ఒక కంపెనీ గా మార్చాలని డిమాండ్ చేశారు. ఎంపీని కలిసిన వారిలో యూనియన్ నాయకులు సీహెచ్ కళాధర్, జాయింట్ సెక్రెటరీ ఎండీ రహీముద్దీన్, ఈవీఎస్ సాయి, గుర్రం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

700 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

లింగాల(వత్సవాయి): తెలంగాణ నుంచి వస్తున్న రేషన్ బియ్యాన్ని తెలంగాణ పోలీసులు సోమవారం లింగాల గ్రామ శివారులో పట్టుకున్నారు. కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి ఆదేశాల మేరకు రూరల్ స్టేషన్ ఎస్‌ఐ ఎం.అనిల్‌రెడ్డి ఆధ్వర్యంలో దాడులు చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్రం కోదాడ మండలం అన్నవరం గ్రామానికి చెందిన సాంబయ్య అనే వ్యక్తి అక్రమంగా రేషన్ బియ్యాన్ని అమ్ముతు న్నట్లు గుర్తించి అతన్ని పట్టుకున్నారు. అతని నుంచి వివరాలు రాబట్టగా అతను లింగాల గ్రామానికి చెందిన నరసింహారావు అనే వ్యక్తికి బియ్యాన్ని అమ్ముతున్నట్లు తెలిపాడు. దీంతో సాంబయ్యను వెంటబెట్టుకుని అక్రమంగా బియ్యం నిల్వచేసిన ప్రదేశానికి తీసుకువెళ్లారు. అక్కడ మొత్తం 700 క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించారు. పీడీఎస్ డీటీ రెడ్డి ఆధ్వర్యంలో బియ్యాన్ని ప్రత్యేక వాహనంలో తెలంగాణకు తరలించారు.